క్లుప్తంగా

ఆపదలో ఆపన్న హస్తం.. సీఎం రిలీఫ్ ఫండ్



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మూలగుండ్ల సీతారాంరెడ్డి

గరిడేపల్లి : ఆపదలో పేదల పాలిట ఆపన్న హస్తం.. సీఎం రిలీఫ్ ఫండ్ అని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన ఏడుగురికి మంజూరైన రూ. 2,84500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ శాఖ అధ్యక్షుడు యోహాన్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ బచ్చలకూరి మట్టయ్యతో కలిసి ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండ్ల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మూలగుండ్ల సుధాకర్‌రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్యస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం ప్రారంభం



సీతాలమ్మ, మడేలయ్య, పోతరాజు విగ్రహాలను ఊరేగిస్తున్న రజక కులపెద్దలు

మునగాల : మండల కేంద్రంలోని చెరువుగట్టు ప్రాంగణంలో నిర్మించిన రజకుల కులదైవం శ్రీసీతాలమ్మ సమేత మడేలయ్యస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీతాలమ్మ, మడేలయ్య, పోతరాజుల విగ్రహాలను శనివారం స్థానిక శివాలయం నుంచి ట్రాక్టర్‌పై మునగాలలోని పురవీధులలో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాలకు మహిళలు నీళ్లు ఆరబోసి పూజలు జరిపారు. ఆలయంలో ఈనెల 18న విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ముక్కొళ్ల వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగెళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, రజక సంఘం గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి సతీమణి మృతి



స్వరాజ్యం (ఫైల్)

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, దివంగత మాజీ సర్పంచ్ బహుదొడ్డి రామారావు సతీమణి స్వరాజ్యం(78) శనివారం కోదాడలోని తన కూతురు నివాసంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు సీపీఎం సీనియర్ నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా, కొక్కిరేణిలో ఆదివారం ఉదయం పది గంటలకు స్వరాజ్యం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో విఫలం



మాట్లాడుతున్న ముల్కలపల్లి రాములు

కోదాడ : ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు ఆరోపించారు. శనివారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడంతో ప్రజాప్రతినిధులు లేక, అధికారులు పట్టించుకోక గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 2 వరకు సర్వే నిర్వహించి వాటి పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మిట్టగడుపుల ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య, దాసరి శ్రీను, కేవీపీఎస్ నాయకులు జంగపల్లి సాయికుమార్ పాల్గొన్నారు.

18న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

మునగాల : మండల కేంద్రంలో ఈనెల 18వ తేదీన నిర్వహించబోయే భవన నిర్మాణ కార్మిక సంఘం 5వ మండల మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో భవన నిర్మాణ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ దస్తగిరి, నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి అల్లి నాగారాజు, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు, సభ్యులు షేక్ సైదా, జాన్ పాషా, షేక్ ఖాజా, జి.కనకయ్య, నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోదాడ : వేడుకల్లో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు, చిన్నారులు



మునగాల : పూజలో పాల్గొన్న యాదవ సంఘం సభ్యులు, భక్తులు

కోదాడరూరల్ : పట్టణంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ప్రగతి మహిళా మండలి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 116 (చప్పన్‌భోగ్) ప్రసాదాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం మండలి అధ్యక్షురాలు నూనె సులోచన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కోశాధికారి కల్పన, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉట్లు కొట్టిన చిన్నారులు..

కోదాడ : పట్టణంలోని తేజ టాలెంట్ స్కూల్, చిన్నారి ప్లే స్కూల్స్‌లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాచిన్నారులు ఉట్లు కొట్టారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.

మోతె : మండల వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్లు కొట్టి ఆకట్టుకున్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో..

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయం ఆవరణలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను యాదవ సంఘం, శ్రీకృష్ణ భక్త బృందం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు చిన్నారులు చిన్నికృష్ణుని వేషధారణలో చేసిన అభినయం పలువురిని ఆకట్టుకుంది. ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని యాదవ సంఘం నాయకుడు కాంచాని కృష్ణమూర్తి ప్రారంభించారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో ప్రథమ బహుమతిని లొడంగి గోపి, ద్వితీయ, తృతీయ బహుమతులను లేళ్ల ఆకాష్, తృతీయ బహుమతిని ముంత లింగయ్య గెలుచుకున్నారు. కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు తూముల వీరస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, యాదవసంఘం నాయకులు, శ్రీకృష్ణభక్త బృందం సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చిలుకూరులోని గ్లోబస్ పాఠశాలలో విద్యార్థులు ఉట్లు కొట్టారు. గోపికలు, చిన్నికృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. పాత చిలుకూరులోని గ్రామ పంచాయతీ వద్ద ఆలయ పూజారి సిరికొండ అనంతకృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో యాదవులు ప్రత్యేక పూజలు జరిపి ఉట్లు కొట్టారు.

మేళ్లచెరువు : మండలంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్లు కొట్టారు. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలలో అలరించారు.

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి (ఉట్ల పండుగ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిగారపు సైదులు, ఈఓ నాగెళ్ల శంభిరెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : తేజ టాలెంట్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి



కోదాడరూరల్ : పూజలో పాల్గొన్న ప్రగతి మహిళా మండలి సభ్యులు



మేళ్లచెరువు : దొండపాడులో..



మఠంపల్లి : చౌటపల్లిలోని ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



మోతె : వేడుకల్లో గ్రామస్తులు



మేళ్లచెరువు : రేపూరులో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



చిలుకూరులో గ్లోబస్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

నేటి నుంచి ముత్యాలమ్మ పండుగ

- ఆలయాలు సుందరంగా ముస్తాబు
- 17, 18 తేదీల్లో పెద్ద ముత్యాలమ్మ, చిన్న ముత్యాలమ్మకు మొక్కుల సమర్పణ
- 21న కనకదుర్గమ్మకు పూజలు



ముత్యాలమ్మ ఆలయం, ఇన్‌సెట్‌లో అమ్మవారు

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ఆదివారం మహిళలు బోనాలు తలపై ఎత్తుకుని ర్యాలీగా వెళ్లి ఊరచెరువు గట్టున కొలువై ఉన్న పెద్ద ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి చీర, సారె, నైవేద్యం సమర్పిస్తారు. ప్రజలు కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. సోమవారం మూడు గుళ్ల ముత్యాలమ్మ ఆలయంలోని చిన్న ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. 21వ తేదీన పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు, మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఉత్సవంలో భాగంగా రైతులు ప్రభలను అందంగా అలంకరించి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై కట్టి మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారి అనుగ్రహం పొందడం ఇక్కడ ఆనవాయితీ. పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ముత్యాలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించి ఆశీస్సులు పొందుతారు.

అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు..

జాతర నిర్వాహకులు వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో వీధుల్లో స్ప్రే చేయడం, బ్లీచింగ్ చల్లడం, తదితర ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. విద్యుత్ అధికారులు లైటింగ్ ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ చరమంద రాజు ఆధ్వర్యంలో ము గ్గురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, దాదాపు 120 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు.

ఎర్రకోట స్వాతంత్య్ర వేడుకల్లో బెట్టెగూడెం రైతు



ఢిల్లీలోని ఎర్రకోటలో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న కందుకూరి నాగిరెడ్డి దంపతులు

పాలకవీడు : ఢిల్లీలోని ఎర్రకోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో పాలకవీడు మండలంలోని బెట్టెగూడెం గ్రామానికి చెందిన కందుకూరు నాగిరెడ్డి, అరుణకుమారి దంపతులు పాల్గొన్నారు. లార్డ్స్ ఇంజినీరింగ్ యూనివర్సిటీలో సీఎస్‌ఈ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగిరెడ్డికి వ్యవసాయంపై ఉన్న మక్కువతో గ్రామంలో తనకున్న 9 ఎకరాల్లోని సుమారు ఐదు ఎకరాల్లో ఔషధ రకానికి చెందిన వస సాగు చేపట్టారు. తాను వస సాగు చేయడంతో పాటు సహచర రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాడు. దీంతో ఎర్రకోటలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనేందుకు భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, జాతీయ ఔషధ మొక్కల పెంపకం బోర్డు నుంచి నాగిరెడ్డి దంపతులకు ఆహ్వానం లభించింది. తమకు ఈ అరుదైన గౌరవం దక్కడం ఊహించలేనిదని ఈ సందర్భంగా నాగిరెడ్డి దంపతులు తెలిపారు.

మానవాళికి దిక్సూచి భగవద్గీత



భగవద్గీతలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

కోదాడరూరల్ : శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత జ్ఞానం మానవాళికి దిక్సూచి అని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి కోదాడ శాఖ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కోదాడ మండలంలోని కాపుగల్లులో గల శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఈ నెల 18న చేపట్టబోయే స్వామివారి ఊరేగింపును విజయవంతం చేయాలన్నారు. భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగరావు, సుబ్బారావు, శైలజ, చందన, మహేష్, విజయ, శివరామకృష్ణ, రమ్య తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా సీసీరోడ్డు



ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా గుంతలమయంగా రోడ్డు

మునగాల : మండల కేంద్రంలోని అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి కొక్కిరేణి వెళ్లే రోడ్డులో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేశారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ, మోడల్‌స్కూల్, కస్తూరిబా పాఠశాలకు వెళ్లే దారిలో కొంత మేర రోడ్డు వేయలేదు. దీంతో రోడ్డుపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలకు సాగించే సుమారు పది గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలలో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు



మొక్క నాటుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు దంపతులు

కోదాడరూరల్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యాదా సుధాకర్, శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటరమణ, నరేందర్, సాయి, అశోక్, శ్రీనివాసరావు ఉన్నారు.

7న ఆవోప వార్షిక సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోప) వార్షిక సమావేశాన్ని సెప్టెంబర్ 7వ తేదీన స్థానిక వాసవి భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగవేటి సతీష్‌కుమార్, పెనుగొండ శ్రీనివాస్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడులాగానే పేద, మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, పేద మహిళలకు పెన్షన్ల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు దాతలు సహకరించాలని వారు కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం బీజేపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ పుట్టినరోజును పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, నడిగూడెం మండల శాఖ అధ్యక్షుడు బండారు వీరబాబుయాదవ్, రెడ్డిపల్లి సైదులు, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ,జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కలకోవను వణికిస్తున్న విషజ్వరాలు

- నలుగురికి డెంగ్యూ నిర్ధారణ
- రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు
- పరిశుభ్రతపై దృష్టి సారించిన గ్రామ పంచాయతీ సిబ్బంది



కలకోవలో వైద్యశిబిరంలో జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

మునగాల : మండలంలోని కలకోవను విషజ్వరాలు వణికిస్తున్నాయి. గ్రామంలో గత పదిరోజులుగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా హరిజన కాలనీలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే పలువురు డెంగ్యూ బారిన పడి సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చేరగా పలువురు కోదాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కలకోవలో విషజ్వరాల వ్యాప్తిని గమనించిన రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగు రోజుల క్రితం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అంతేకాకుండా రేపాల పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బందితో పాటు 22 మంది ఆశావర్కర్లు గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించి వారికి రక్తపరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామంలో 23 మంది జ్వర పీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు నిర్వహించామని, వారిలో నలుగురికి డెంగ్యూ నిర్ధారణ అయిందని, రేపాల పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు, సిబ్బంది సహకారంతో పలు వీధుల లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగిస్తున్నారు. మూడు రోజులుగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయమనోహరి గ్రామాన్ని సందర్శిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందిపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

ఆగని వానలు.. వరదలతో కష్టాలు



నడిగూడెం బస్టాండ్ సెంటర్ మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు



మోతె : ఉధృతంగా ప్రవహిస్తున్న రావిపహాడ్ పెద్ద వాగు



నడిగూడెం : కరివిరాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నడిగూడెం : మండల వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, రైతులు అతలాకుతలం అవుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని చెరువులు అలుగు పోస్తున్నాయి. నడిగూడెం చౌదరి చెరువు నిండి అలుగు పోస్తుండడంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న కల్వర్టు మీదుగా వరద నీరు ప్రవహిస్తోంది. పలువురి ఇళ్లలోకి నీరు చేరింది. నడిగూడెం బీసీ, ఎస్సీ కాలనీల మధ్య ఉన్న కల్వర్టు మీదుగా శుక్రవారం రాత్రి వేళ పలువురు ద్విచక్రవాహనదారులు వెళ్లగా బైక్ అదుపుతప్పి పడింది. వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అలాగే వేణుగోపాలపురం చెరువు అలుగు పోస్తుండడంతో రహదారిని బ్లాక్ చేశారు. కరివిరాల గ్రామ సమీపాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కరివిరాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ నీటి ముంపునకు గురైంది. వేణుగోపాలపురం, బృందావనపురం, కరివిరాల, నడిగూడెం, చాకిరాల, రత్నవరం గ్రామాల పరిధిలో వందల ఎకరాల వరి పొలాలు నీటమునిగాయి. చెన్నకేశ్వాపురం సమీపంలో పత్తి చేలు నీట మునిగాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

మోతె : వర్షాలకు మోతె మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రావిపహాడ్ పెద్దచెరువు అలుగు పోస్తుండడంతో వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో రావిపహాడ్- సిరికొండ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పంటలు నీట మునిగాయి. కూడలి ఏరు నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. పాలేరు రిజర్వాయర్ నిండడంతో వరద నీటిలో నర్సింహాపురం, ఉర్లుగొండ, నేరడవాయి, తుమ్మగూడెం, అన్నారిగూడెం గ్రామాల రైతుల పంటల పొలాలు, విద్యుత్ మోటర్లు మునిగాయి. రావిపహాడ్ పెద్ద చెరువు కింద ఉన్న వరి పొలాలు వరద నీటికి కొట్టుకుపోయి పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వరద నీటితో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.



నడిగూడెం : చెన్నకేశ్వాపురం వద్ద నీటమునిగిన పత్తి చేను



నడిగూడెం : కరివిరాల వద్ద దెబ్బతిన్న రహదారి

వైద్యానికి అడ్డంకిగా..



మోతె పీహెచ్‌సీ గేటు వద్ద నిలిచిన వరద నీరు

మోతె : వర్షానికి మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి వెళ్లే గేటు వద్ద వరద నీరు నిలిచింది. దీంతో ఆసుపత్రిలోకి వెళ్లివచ్చే సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సమస్యను పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

రాకపోకలకు అడ్డుగా మిషన్ భగీరథ పైప్‌లైన్



వరదకు రోడ్డుపైకి కొట్టుకొచ్చిన మిషన్ భగీరథ పైప్‌లైన్

మేళ్లచెరువు : ఇటీవల కురిసిన వానలకు మండల కేంద్రం పరిధిలోని నాగులచెరువు అలుగు పోయడంతో మేళ్లచెరువు నుంచి పొలాలకు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జిపై మిషన్ భగీరథ పైపులైన్ వరదకు కొట్టుకుపోయి పక్కకు జరిగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రాత్రి సమయంలో ఇటునుంచి వచ్చే ప్రయాణికులు ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రాకపోకలకు పైప్‌లైన్ అడ్డుగా లేకుండా చూడాలని కోరుతున్నారు.